సాక్షి
సిద్దిపేట

ఆదివారం । 15 । అక్టోబర్ । 2023

వైభవంగా ఎంగిలి పూల బతుకమ్మ

- ప్రతిబింబించిన తెలంగాణ సంస్కృతి
- తొమ్మిది రోజులు సంబరాలు
- బతుకమ్మ ఆటపాటలతో మహిళల సందడి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బతుకమ్మ సంబురాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పండగను మహిళలు తొమ్మిది రోజులపాటు జరుపుకుంటారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మను మహిళలు, యువతులు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక. తంగేడు, గునుగు, చామంతి , ఉద్రక్ష, గడ్డిపువ్వు, బంతి, గుమ్మడి తదితర పూలను వరుసగా పేర్చి బతుకమ్మలను చేస్తారు. తొమ్మిదిరోజులు జరుపుకునే ఈ పండగలో తొమ్మిది తీర్ల నైవేద్యాలను బతుకమ్మలకు సమర్పిస్తారు. మరణించిన కుటుంబ పెద్దల పేర్లమీద బ్రాహ్మణులకు బియ్యం దానంగా ఇస్తారు. ఈ అమావాస్యను పెద్దల అమావాస్య అని పిలుస్తారు. బతుకమ్మ ఆడిన అనంతరం వీటిని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.



సిద్దిపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మలతో సెల్ఫీలు దిగుతున్న యువతులు

న్యూస్‌రీల్

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్



ఎస్.శ్వేత, సిద్దిపేట పోలీసు కమిషనర్

సిద్దిపేటకమాన్: జిల్లాలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్న కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిద్దిపేట సీపీ శ్వేత శనివారం తెలిపారు. ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నందున పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల పరిధిలో ప్రజలు గుమిగూడి ఉండకూడదని తెలిపారు.

అభివృద్ధికి చిరునామా 'గాగిల్లాపూర్'

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయిన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పాలనలో పడావుగా ఉన్న గాగిల్లాపూర్‌ను అభివృద్ధికి చిరునామాగా మార్చామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో శనివారం రాత్రి ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కోట్లాది రూపాయలతో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రాజెక్టు కోసం సేకరించిన భూములను రైతులకు ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. కేవలం ఎన్నికల కోసం వచ్చే నాయకులకు బుద్ధి చెప్పేలా తనకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షల మేరకు, వారి అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు గ్రామ వార్డు సభ్యులు, నాయకులకు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ చంద్రకళ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మల్లేశం, ఉపసర్పంచ్ తిరుమల చేరికల కమిటీ కన్వీనర్లు శ్రీనివాస్ గుప్త, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలి

బీఎస్పీ, పీడీఎస్‌యూ డిమాండ్



ఆందోళన చేస్తున్న బీఎస్పీ, పీడీఎస్‌యూ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను రద్దు చేయాలని బీఎస్పీ, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం టీఎస్‌పీఎస్సీను రద్దు చేయాలని పట్టణంలోని రంగధాంపల్లి ఆవరణలోని రాజీవ్ రహదారిపై ఆందోళనకు దిగారు. అంతకు ముందు బీజేఆర్ చౌరస్తా నుంచి రంగధాంపల్లి అమరవీరుల స్థూపం వరకు ర్యాలీగా వచ్చారు. వీరి ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో త్రీటౌన్ పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. వరుసగా పరీక్షలు రద్దుతో పాటుగా వాయిదాలు పడుతుండటంతో నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే టీఎస్‌పీఎస్సీ బోర్డు చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని తొలగించి, బోర్డును ప్రక్షాళన చేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మోహన్, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ప్రజాఫ్రంట్ నాయకుడు సత్తయ్య, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరి ఉమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సారూ.. కావాలి వరాలు!

విద్య, వైద్యం పారిశ్రామిక రంగాలు అభివృద్ధి వైపు అడుగు పడాలి

- కొత్తపల్లి -జనగామ హైవే నిర్మిస్తే యాదాద్రికి తగ్గనున్న దూరభారం
- హుస్నాబాద్‌లో 100 పడకల ఆస్పత్రి హామీ నెరవేర్చాలి
- ఆర్టీసీ డిపో ఉన్నా రూట్ హక్కులు లేవు
- ఎల్లాపూర్ వయా హుస్నాబాద్ - సిద్దిపేటకు రైల్వేలైన్
- ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హుస్నాబాద్ ప్రజల విన్నపాలు



హుస్నాబాద్: బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు సెంటిమెంట్‌గా భావిస్తున్న హుస్నాబాద్ నుంచి ఆదివారం ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడుతున్నారు. తొలి ప్రజాఆశీర్వాద సభ ఇక్కడి నుంచే ప్రారంభం కానుండంతో తమ ప్రాంత అభివృద్ధికి వరాలు ప్రకటిస్తారని స్థానిక ప్రజలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఈ నియోజకవర్గం కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలతో ముడిపడి ఉంది. విద్య, వైద్యం, పారిశ్రామికంగా, రవాణా పరంగా అభివృద్ధి చెందాల్సి ఉంది. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. ఉపాధికి నైపుణ్యం పెంపొందించే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ లేదు. ప్రజాఆశీర్వాద సభకు హాజరవుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై ప్రత్యేక కథనం.

- హుస్నాబాద్ ప్రాంతంలో అత్యధికంగా గిరిజన జనాభా ఉంది. ఉపాధి, వసతులు లేక వారంతా పట్టణాలకు వెళ్లి ఆటోలు నడుపుకుంటున్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే వారికి మేలు జరుగుతుంది.
- హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు కలిపి హుస్నాబాద్‌లో డిగ్రీ కళాశాల మాత్రమే ఉంది. ఉన్నత విద్య కోసం విద్యార్థులు జిల్లా కేంద్రాలకు లేదా నగరాలకు వెళ్తారు. ఆర్థిక స్థామత లేకనివారు మధ్యలోనే చదువుకు స్వస్తి చెబుతున్నారు. వీరి కోసం పీజీ, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తే వారు ఉజ్వల భవిష్యత్ బాట పడుతుంది.
- హుస్నాబాద్ డిపో ఉన్నా రూటు హక్కులు లేవు. లాంగ్ రూట్లల్లో సర్వీస్‌లు లేకపోవడంతో డిపో నష్టాల బాటలో పయనిస్తోంది. ఈ రూట్లల్లో ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్ బస్సులు నడిపితే డిపోకు మరింత ఆదాయం సమకూరుతుంది.
- హుస్నాబాద్ ప్రాంతంలో క్రీడాకారులకు కొదవ లేదు. ప్రో కబడ్డి పోటీల్లో ఆడిన మల్లేశ్ ఈ ప్రాంత క్రీడాకారుడే. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులు ఉన్నారు. ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే క్రీడాకారులు మరింత నైపుణ్యం సాధించే అవకాశం ఉంటుంది.
- ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏదైనా పరిశ్రమను నెలకొల్పితే స్థానిక యువత ఉపాధి పొందుతారు.
- కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ మీదుగా జనగామకు జాతీయ రహదారి కావాలని ఇటీవల హుస్నాబాద్ పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామన్నారు. ఈ రహదారి మంజూరైతే పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదాద్రికి దూరభారం తగ్గుతుంది.
- హుస్నాబాద్‌లో రైలు కూత కూయాలని ప్రతీ ఎన్నికల్లో ప్రజల నుంచి డిమాండ్ వస్తుంది. ఎల్లాపూర్ నుంచి వయా హుస్నాబాద్ మీదుగా సిద్దిపేటకు రైల్వేలైన్ వేస్తే ఈ ప్రాంత ప్రజల కల నెరవేరుతుంది.
- హుస్నాబాద్‌లో 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తే మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం ఉండదు. అలాగే నర్సింగ్ కళాశాల కావాలని ఈ ప్రాంత యువత కోరుతోంది.
- హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాల సందర్భంగా మంత్రి హరీశ్‌రావు ఆడిటోరియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు హామీ నెరవేరలేదు.
- నియోజకవర్గంలో ఏకైక మున్సిపాలిటి హుస్నాబాద్ గ్రేడ్ 3 కే పరిమితమైంది. ఇప్పటికే మున్సిపాలిటి సమీప గ్రామాలకు విస్తరిస్తూ అభివృద్ధి చెందుతోంది. పక్కనున్న కొన్ని గ్రామాలను హుస్నాబాద్ మున్సిపాలిటిలో కలపాలని ప్రతిపాదనలు చేశారు. జనాభా దృష్ట్యా హుస్నాబాద్ మున్సిపాలిటీని గ్రేడ్ 1గా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.
- ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేసి ఫోరెన్సిక్ నిపుణులను నియమించాలి. అలాగే బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేయాలి.

ఆశీర్వాద సభకు సర్వంసిద్ధం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

- భారీ జనసమీకరణకు సన్నాహాలు
- పట్టణమంతా గులాబీమయం
- ఏర్పాట్లను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం చేశారు. వీఐపీలకు, మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సభావేదిక ఎడమ వైపున హెలి ప్యాడ్ నిర్మించారు. నియోజకవర్గం పరిధిలోని ఏడు మండలాలు, హుస్నాబాద్ పట్టణం నుంచి సభకు సుమారు లక్ష మందిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జనానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బారికేట్లను ఏర్పాటు చేశారు. మూడోసారి కేసీఆర్ ఎన్నికల శంఖారావాన్ని మోగించేందుకు గతం కంటే బ్రహ్మాండంగా సభా ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా వేదిక గులాబీ రంగులో ఉండే విధంగా అలంకరించారు. పట్టణంలో ఎటు చూసినా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలతో నింపారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభా వేదిక నుంచి కేసీఆర్ ప్రసంగిస్తారు. ఏర్పాట్లను మంత్రి హరీశ్‌రావు సూచనలతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మికాంతారావు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లలో తెలంగాణ సమగ్రాభివృద్ధి, పనిచేసే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. దేశంలోనే సంక్షేమం, అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందిస్తాయని వారు ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.



ప్రజా ఆశీర్వాద సభావేదిక

పార్కింగ్ స్థలాలు

హుస్నాబాద్, అక్కన్నపేట, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాల నుంచి వచ్చే వాహనదారులు కరీంనగర్‌లోని సబ్ స్టేషన్ పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో, అలాగే సెయింట్ జోసఫ్ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసి సభాస్థలికి చేరుకోవాలని సీపీ శ్వేత అన్నారు. అలాగే కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్ మండలాల నుంచి వచ్చే వాహనదారులు కరీంనగర్ రోడ్‌లోని ఇండియన్ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసి సభాస్థలికి చేరుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్

ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 7 గంటల వరకు ట్రాఫిక్ డైవర్షన్‌కు ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. హుస్నాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే వాహనదారులు నాగారం, మహ్మదాపూర్, బొమ్మనపల్లి, సుందరగిరి నుంచి కరీంనగర్‌కు వెళ్లాలన్నారు. అలాగే కరీంనగర్ నుంచి హుస్నాబాద్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనదారులు సుందరగిరి, బొమ్మనపల్లి, మహ్మదాపూర్, నాగారం మీదుగా హుస్నాబాద్‌కు చేరుకోవాలని సూచించారు.

రైల్వే ఆస్తుల ధ్వంసంపై విచారణ

- వీడియోలు సేకరిస్తున్న రైల్వే పోలీసులు
- నిందితుల గుర్తింపు
- పలువురిపై కేసు నమోదు

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట – సికింద్రాబాద్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన ఘర్షణ, ఆస్తుల ధ్వంసంపై రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు. సిద్దిపేట – మనోహరాబాద్ వరకు రూ.1,200 కోట్ల వ్యయంతో రైల్వే లైన్ నిర్మించారు. ఈనెల 3వ తేదీన సిద్దిపేట–సికింద్రాబాద్ రైలును నిజామాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించగా, రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రైల్వేస్టేషన్‌కు బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషి వల్లే సిద్దిపేటకు రైలు వచ్చిందని, బీజేపీ కార్యకర్తలు మోదీ వల్లే వచ్చిందని పోటాపోటీగా నినాదాలు చేశారు. దీంతో రైలు ప్రారంభోత్సవం రాసాభాసగా మారింది. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం కేసీఆర్ ఫొటో పెట్టకపోవడంతో ఆ ఫ్లెక్సీని చింపివేశారు. ఈ ఘటనలో రైల్వే ఆస్తులు ధ్వంసమయ్యాయని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ రంగంలోకి దిగింది. మల్కాజిగిరి రైల్వే పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. రైల్వేశాఖ సేకరించిన వీడియోలలో ఆస్తులు ధ్వంసం చేసినవారిని రైల్వే పోలీసులు గుర్తిస్తున్నారు. త్వరలో వారిని రైల్వే కోర్టులో హాజరు పరిచే అవకాశం ఉంది.

ఆయుర్వేద, ఆధ్యాత్మికంపై యోగా శిబిరం



గజ్వేల్‌లో మాట్లాడుతున్న పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు

గజ్వేల్‌రూరల్: భారత్ స్వాభిమాన్ ట్రస్టు, మహిళా పతంజలి యోగా సమితి, యువభారత్, కిసాన్ సేవా సమితి గజ్వేల్ పట్టణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పతంజలి యోగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు శివుడు శనివారం పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన గజ్వేల్‌లో జరగనున్న కార్యక్రమానికి ముఖ్య కేంద్రియ ప్రభారి డాక్టర్ పరమార్థదేవ్ హాజరవుతున్నారన్నారు. ఆయుర్వేద, ఆధ్యాత్మిక అంశాలపై ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.

సెంటిమెంట్ సరే.. అభివృద్ధి ఏదీ?

- గౌరవెల్లి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి
- మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ డిమాండ్

హుస్నాబాద్: ఎన్నికల సెంట్‌మెంట్ కోసం హుస్నాబాద్‌ను వాడుకుంటున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సెంటిమెంట్‌కు తగ్గట్టు ఎందుకు అభివృద్ధి చేయలేదని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2003లో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు రైతుల బాధలను విని చలించిపోయారన్నారు. కాంగ్రెస్ హయంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు 70 శాతం పూర్తి చేశామని, నిర్వాసితులకు పరిహారం, పునరావాస కేంద్రాలను, సొరంగ మార్గాలను పూర్తి చేశామన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని మంత్రి హరీశ్‌రావు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిర్వాసితుల ఇళ్లు ఖాళీ చేయించి ఇంత వరకూ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదో బహిరంగ సభలో కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట, గజ్వేల్ లాగానే ఇక్కడ డబుల్ బెడ్రూం ఇళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో లీక్ కాకుండా ఏ పరీక్ష నిర్వహించలేదని విమర్శించారు. గ్రూప్ 2 పరీక్షలు వాయిదా పడడంతో వరంగల్ విద్యార్థిని ప్రవళిక ఆత్మహత్య చేసుకుందని, అది ప్రభుత్వ హత్యే అని ఆరోపించారు. హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేటలో కలిపారని, వచ్చే ఎన్నికల్లో బంగారు బిస్కెట్లు ఇచ్చినా ప్రజలు వారి వెంట వెళ్లరన్నారు. అవినీతి సొమ్ము, లిక్కర్ స్కాం, మైనింగ్, ఇసుక మాఫీతో సంపాదించిన డబ్బును తాయిలాలు ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధపడిందని ఆరోపించారు. ప్రజలు మాత్రం మార్పును కోరుకుంటున్నారన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తులో భాగంగా ఐదు స్థానాల విషయంలో చర్చలు జరుగుతున్నాయని, గతంలో హుస్నాబాద్‌ను సీపీఐకి కేటాయించామని, ఈ సారి ఈ సీటును కాంగ్రెస్‌కు వదిలివేయాలని సీపీఐని కోరామన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎండీ హుస్సేన్, యాదవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బంక చందు, అయిలయ్య, తిరుపతి రెడ్డి, శ్రీనివాస్, ధర్మయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

ఘొల్లుమన్న తిగుల్

చెరువులో పడి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికుల మృతి

- పెద్ద దిక్కు కోల్పోయామని తల్లడిల్లిన కుటుంబాలు
- న్యాయం చేయాలని మృతదేహాలతో ధర్నా



చెరువులో గాలిస్తున్న ఈతగాళ్లు, (ఇన్‌సెట్‌లో) తోటి కార్మికులను రక్షించిన మధు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పారిశుద్ధ్య కార్మికులను మృత్యురూపంలో చెరువు కబళించింది. బతుకమ్మ చెరువు మెట్లను శుభ్రం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మండలంలోని తిగుల్ గ్రామంలో గిరిపల్లి భారతి(45), ఎల్లం యాదమ్మ(42), కర్రమొల్ల బాబు(26) మృతి చెందగా.. మరో ఇద్దరు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. పండగ పూట పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబాలు తీవ్ర దుఃఖంలో మునిగాయి. గిరిపల్లి భారతి భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. భారతికి కూతురు శ్యామల, కొడుకు వంశీ ఉన్నారు. వంశీ ఆరో తరగతి చదువుతున్నారు. అమ్మానాన్న మృతితో వంశీ అనాథగా మారాడు. ఎల్లం యాదమ్మ భర్త గతంలో పంచాయతీలో హెల్పర్‌గా పనిచేశారు. వీరికి కొడుకు మహేష్, మాధవి ఉన్నారు. విద్యుత్‌షాక్‌తో మంచానికే పరిమితం అయ్యారు. అప్పటి నుంచి యాదమ్మ కార్మికులుగా పనిచేస్తుంది. ఇంటికి పెద్ద దిక్కు యాదమ్మ మృతితో ఆ కుటుంబ వీధిన పడే పరిస్థితి నెలకొంది. కర్రమొల్ల బాబు ఏడాదిన్నర క్రితం కార్మికుడి విధులో చేరాడు. భార్య స్వప్న, ఇద్దరు కుదుకులు శ్రీవర్ధన్, ఆయాన్ ఉన్నారు. బాబు మృతితో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. దళిత కుటుంబాలు కావడంతో వారికి భూమి లేకపోవడం, కార్మికులుగానే కుటుంబాలను పోషించుకుంటున్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

చెరువులో పడి ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత కుటుంబాలు, దళిత సంఘాలు ఆందోళన చేపట్టాయి. ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశాయి. రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగింది. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆర్డీఓ బన్సిలాల్ బాధిత కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అయినా వారు వినకపోవడంతో ఏసీపీ రమేశ్ జోక్యం చేసుకొని జరిపిన చర్చలు ఫలించాయి. చివరకు వారు శాంతించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తరలించారు.

మంత్రి హరీశ్ తీవ్ర దిగ్భ్రాంతి

చెరువులో మునిగి ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందడం కలిచివేసిందని మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం


జోగవ్వ (ఫైల్)

దుబ్బాకటౌన్: మతిస్థిమితం లేని వృద్ధురాలు మూడురోజులుగా అదృశ్యమైన ఘటన దుబ్బాక పట్టణంలోని 12వ వార్డు రేపల్లెవాడలో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన సమచారం మేరకు...పట్టణానికి చెందిన బాలుగారి జోగవ్వ(75) ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మతి స్థిమితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉంచుతున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం లేచి చూసేసరికి జోగవ్వ కనబడకుండా పోయింది. అంతా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె కుమారుడు బాల్‌రాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మెడికల్ షాప్‌కు వెళ్లి..


ప్రహ్లాద్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: మెడికల్ షాప్‌కు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఆర్కేనగర్‌కు చెందిన ప్రహ్లాద్ 11న సాయంత్రం మెడికల్ షాప్‌కు మందులు తీసుకురావడానికి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. స్థానికంగా వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భూతగదాలతో దాడి

అల్లాదుర్గం(మెదక్): భూ తగదాలతో ఒకరిపై దాడి చేసి గాయపరిచిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గందలి రవికి, లక్ష్మణ్‌తో భూమి తగదాలు ఉన్నాయి. శుక్రవారం రవి కూర్చుని ఉండగా లక్ష్మణ్, శివకుమార్, యాదయ్య, దుర్గయ్య సత్తమ్మ, లచ్చమ్మ, స్వరూప కలిసి దాడి చేశారు. రవి సోదరుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

అభయ 'హస్తం' ఎవరికో..!

కాంగ్రెస్ టికెట్ కోసం పోటాపోటీ
- పోటీలో నలుగురు నేతలు
- చివరకు దక్కేదెవరికో..?



నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ టికెట్ కోసం కొందరు నాయకులు ఎవరికి వారు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అయితే అధిష్టానం ఎవరికి టికెట్ కేటాయిస్తుందన్న ఉత్కంఠ నెలకొంది. నర్సాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, పీసీసీ డెలిగేట్లు ఆంజనేయులుగౌడ్, రవీందర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. మొదటి దశలోనే రవీందర్‌రెడ్డి పేరును పార్టీ రాష్ట్ర కమిటీ తొలగించినట్లు తెలిసింది.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ?

సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి బీఆర్ఎస్ టికెట్ రాదని తేలడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరుతారని ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. నర్సాపూర్ టికెట్‌ను సీఎం కేసీఆర్ సునీతారెడ్డికి ఇవ్వాలని నిర్ణయించారని, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో చెప్పారని, అందుకు ఎమ్మెల్యే విభేదించారని ప్రచారం జరిగింది. అలాగే మరో ప్రముఖ వ్యాపారవేత్తతో వెళ్లి కాంగ్రెస్ టికెట్ విషయమై చర్చలు జరిపారని ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారంపై మదన్‌రెడ్డి స్పందిస్తూ తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని స్పష్టం చేశారు. టికెట్ తనకే వస్తుందని, సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉందని, ఎలాగైనా ఎన్నికల బరిలో ఉంటానని ప్రకటించడం చర్చనీయాంశమైంది. కాగా ఇటీవల బీఆర్ఎస్‌లో జరిగిన పరిణామాలను కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఇటీవల వారం, పది రోజుల వ్యవధిలో నాలుగు సార్లు ప్రగతి భవన్‌కు వెళ్లడం.. గంటల తరబడి అక్కడ నిరీక్షించి రావడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పునరాలోచనలో పడిందని, ఒకవేళ ఆయనకు టికెట్ ఇస్తే కాంగ్రెస్‌లో ఉంటారా? లేక తిరిగి బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోతారా? అనే కోణంలో ఆలోచించి చివరికి మదన్‌రెడ్డి రాకపై కాంగ్రెస్ పార్టీ ఆశలు వదులుకుందని సమాచారం. అయితే.. నర్సాపూర్ టికెట్ బీఆర్ఎస్ అధికారికంగా ప్రకటించిన తర్వాత ఎమ్మెల్యే ఏ నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

బీసీ నినాదం ఒత్తిడి

కాంగ్రెస్ పార్టీలో టికెట్ కేటాయింపులలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలనే నినాదం తెరపైకి రావడంతో నర్సాపూర్ టికెట్ కేటాయించే అంశంపై బీసీల ఒత్తిడి పడినట్లు తెలుస్తోంది. బరిలో ఉన్న ఆవుల రాజిరెడ్డి, గాలి అనిల్ కుమార్, ఆంజనేయులుగౌడ్ పేర్లను పార్టీ రాష్ట్ర కమిటీ అధిష్టానానికి పంపారని, దీంతో ఓసీ సామాజిక వర్గానికి చెందిన ఆవుల రాజిరెడ్డి ముఖ్య నాయకులతో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇక బీసీ సామాజిక వర్గానికి చెందిన గాలి అనిల్‌కుమార్ పేరు మొదటి పరిశీలనలోను, ఆంజనేయులుగౌడ్ పేరు ద్వితీయ స్థానంలో ఉందని తెలిసింది. ఈ నేపథ్యంలో నర్సాపూర్ టికెట్ ఎవరికి దక్కుతుందో వేచి చూడాలి.

మోకాళ్ల మార్పిడి సక్సెస్

వంద ఆపరేషన్లు పూర్తి చేసిన వైద్యులు
- సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి ఘనత
- ఉచితంగా ఆపరేషన్‌లు


హర్షం వ్యక్తం చేస్తున్న వైద్యులు

సిద్దిపేటకమాన్: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వంద మందికి మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తిచేశారు. శుక్రవారం ఒక వృద్ధుడికి నిర్వహించిన శస్త్ర చికిత్సతో 100 ఆపరేషన్‌లు పూర్తి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. దుబ్బాక రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు కట్కూరి రఘుపతిరెడ్డి ఐదేళ్లుగా మోకాలు నొప్పితో బాధపడుతున్నాడు. దీంతో ఆయన వారం రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. అతడిని పరీక్షించిన ఆర్థోపెడిక్ విభాగ వైద్యులు పరీక్షలు నిర్వహించి సమస్యను గుర్తించారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రి ఆర్థో సర్జన్ ఆధ్వర్యంలో వైద్యబృందం సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి మోకాలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశారు. అనంతరం శనివారం వృద్ధుడిని పరీక్షించిన వైద్యులు అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా మోకాలు నొప్పులతో బాధపడుతున్న వారు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదిస్తే అవసరమైన వారిని గుర్తించి, వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామని వైద్యులు తెలిపారు.

ఆపరేషన్‌లు

గాంధీ, ఉస్మానియా ఆసుపత్రుల తర్వాత మొట్ట మొదటి సారిగా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ వృద్ధుడికి మోకాలు చిప్పల మార్పిడి శస్త్ర చికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా మోకాలు నొప్పులతో బాధపడుతున్న 50 నుంచి 60 ఏళ్లపై బడిన వారిని గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో వారానికి నాలుగు ఆపరేషన్‌లు నిర్వహించారు. అలా ఇప్పటి వరకు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో 100 మందికి మోకాలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోవాలంటే సుమారు రూ.3 నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఉచితంగా ఆపరేషన్‌లు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు.

ఎన్‌సీసీ, ఎన్‌ఐసీ కాడెట్ల క్రీడా పోటీలు


శిల్పారామం వద్ద ఎన్‌సీసీ, ఎన్‌ఐసీ కేడెట్లు

గజ్వేల్‌రూరల్: స్థానిక బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎస్ఎన్ఐసీకి హాజరైన కాడెట్లు శనివారం క్రీడాపోటీల్లో పాల్గొన్నట్లు క్యాంపు క్రీడాధికారి లెఫ్టినెంట్ కల్నల్ జైస్వాల్ తెలిపారు. శిక్షణలో భాగంగా క్రీడ నిర్ణేతలు ప్రభు, భాను, సంతోష్ సమక్షంలో ఢిల్లీ, పంజాబ్, బిహార్, ఒడిశా డైరెక్టరేట్‌ల మధ్య నిర్వహించిన మొదటి వాలీబాల్ పోటీలో ఢిల్లీ, ఒడిశా గెలుపొందినట్లు పేర్కొన్నారు. దేశంలోని 17 డైరెక్టరేట్‌ల నుంచి వచ్చిన కేడట్లు హైద్రాబాద్‌లోని ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్, శిల్పారామంలను పర్యటించారని శిక్షణాధికారి లెఫ్టినెంట్ కల్నల్ పినాకి తెలిపారు. ఈ పర్యటనకు 303 ఎన్‌సీసీ కేడెట్లతో పాటు 20 మంది అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు, ఏడుగురు పీఐ స్టాఫ్ పాల్గొన్నట్లు లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, లెఫ్టినెంట్ డాక్టర్ మనోజ్ తెలిపారు.

కేసీఆర్ 'బలగం'

ఎన్నికల ఇన్‌చార్జిలుగా హరీశ్, యాదవరెడ్డి, వంటేరు


సీఎం కేసీఆర్

- లక్ష ఓట్లకుపైగా మెజార్టీయే లక్ష్యంగా..
- క్షేత్రస్థాయి కార్యాచరణ ప్రారంభం

గజ్వేల్: గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ముచ్చటగా మూడోసారి పోటీచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లక్ష ఓట్లకుపైగా మెజారిటీ సాధనే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికల «బలగం»సిద్ధమైంది. ఈసారి ఎన్నికల ఇన్‌చార్జిలుగా జిల్లా మంత్రి హరీశ్ రావుతోపాటు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించిన సంగతి తెలిసిందే. లక్ష ఓట్లకుపైగా మెజారిటీ సాధనే లక్ష్యంగా వీరు తమ కార్యాచరణను ప్రారంభించారు. మంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కొండపాక, మర్కూక్, కుకునూర్‌పల్లి, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో బూత్ లెవల్ కమిటీల సమావేశాలను జోరుగా నిర్వహిస్తున్నారు. సమావేశాల్లో బూత్ స్థాయి, గ్రామం, మండల స్థాయి బాధ్యతలను అప్పగిస్తున్నారు. ఒక రకంగా ఇప్పటికే అధికార పార్టీ ప్రచార పర్వాన్ని హోరెత్తిందనే చెప్పాలి. కోడ్ రాకముందే నియోజకవర్గంలోని వివిధ సంఘాల నుంచి భారీ ఎత్తున కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాలను సేకరించిన నేతలు ప్రస్తుతం బూత్ లెవల్ కమిటీల పనితీరును పటిష్టంచేసే పనిలో పడ్డారు.

కేసీఆర్‌ను ఢీ కొట్టేదెవరు?

ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలోని అందరి దృష్టి గజ్వేల్‌పైనే కేంద్రీకృతమై ఉంది. ఇక్కడి నుంచి కేసీఆర్ మూడోసారి పోటీ చేస్తుండగా, ఆయనను ప్రత్యర్థి పార్టీల నుంచి ఢికొట్టేదెవరు? అనే అంశంపై చర్చ జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేరు దాదాపుగా ఖరారు కాగా, బీజేపీ నుంచి ఎవరు బరిలో ఉంటారనేది తేలాల్సి ఉంది. తానూ కేసీఆర్‌పై పోటీ చేస్తానని బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రకటించిన నేపథ్యంలో అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రావాల్సి ఉంది. ఈటల పోటీలో ఉండకపోతే తమకు అవకాశం కల్పించాలని ఇప్పటికే స్థానిక నేతలు అధిష్టానాన్ని కోరుతున్నారు. కేసీఆర్‌పై పోటీ చేసే అభ్యర్థులు దీటైన వారు ఉండటమే కాకుండా ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మలిచగలిగేవారిగా ఉండాలనే ఆలోచనతో కాంగ్రెస్, బీజేపీ ముందుకుసాగుతున్నట్లు తెలుస్తోంది.


మంత్రి హరీశ్‌రావు


ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

నాడు ప్రత్యర్థి.. నేడు ఎన్నికల ఇన్‌చార్జి


వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 2014, 2018 ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న ప్రస్తుత అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఈసారి జరిగే ఎన్నికలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణం. 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణులను సమన్వయ పరిచే బాధ్యతను భుజాన వేసుకున్నారు. ఇటీవల మండలాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతంగా నిర్వహించారు. కోడ్ ముందు వరకు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను సైతం పర్యవేక్షిస్తూనే కొత్త పనులకు ఆమోదం తీసుకురావడానికి కృషి చేశారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లా క్రీడాకారుడు


అభిషేక్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సిద్దిపేట జిల్లా క్రీడాకారుడు అభిషేక్ ఎంపికయ్యాడు. తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో అండర్ 20 విభాగంలో అభిషేక్ పదివేల మీటర్ల పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించాడు. 15 నుంచి 17 వరకు హన్మకొండలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అభిషేక్ పాల్గొంటాడని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్వర్, కార్యదర్శి వెంకట్ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా అభిషేక్‌ను వారు సన్మానించారు. సిద్దిపేట యువకుడు జాతీయ స్థాయిలో ఎంపిక కావడంపై వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు సాయిరాం, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, ఉప్పలయ్య, అశోక్, కనకారెడ్డి అభినందించారు.

రూ.2.87 లక్షల నగదు పట్టివేత


నగదుతో పట్టుబడిన వ్యక్తితో పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల నియమావళి అమలులో భాగంగా పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టణంలోని పాత టోల్‌గేట్ సమీపంలో శనివారం పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిజాంపేట్‌కు చెందిన శ్రీనివాసులురెడ్డి నుంచి రూ.87 వేలు, సికింద్రాబాద్‌కి చెందిన ముఖేశ్ నుంచి రూ.2 లక్షల నగదు పట్టుకున్నారు. ఈ తనిఖీల్లో పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాల తనిఖీలను ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్, పోలీస్ అధికారులు ముమ్మరం చేశారు. మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో శనివారం బస్సులు, వివిధ రకాల వాహనాలను తనిఖీ చేశారు. శుక్రవారం మద్యం, డబ్బు పట్టుబడడంతో తనిఖీలు ముమ్మరం చేశామని సంబంధిత అధికారులు చెప్పారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి డబ్బును తరలించినా, అక్రమంగా మద్యాన్ని తరలించినా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పోలీసులు ముమ్మరంగా తనఖీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గానికి కర్నాటక రాష్ట్రం సరిహద్దులో ఉండడంతో మాడ్గి, న్యాల్‌కల్ మండలంలోని హుసెల్లి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ స్థాయి అధికారి నేతృత్వంలో సిబ్బందిని నియమించి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. కోడ్ అమల్లో ఉన్న కారణంగా ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బు, ఆభరణాలు తరలిస్తే చర్యలు తీసుకుంటామని చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. ఇప్పటి వరకు తనఖీల్లో రూ.16 లక్షల పట్టుకున్నామని చెప్పారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని రింగురోడ్డు సమీపంలో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ నయీముద్దీన్ ఆధ్వర్యంలో వాహనలను తనిఖీ చేసి, నిఘాను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వం

- మాజీ మంత్రి చంద్రశేఖర్


మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం చీఫ్ కో ఆర్డినేటర్ ఎ.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం మొగుడంపల్లి మండలంలోని రాయిపల్లి తండా, మన్నాపూర్, ఇప్పపల్లి, గొడిగార్‌పల్లి, ఖాంజమాల్‌పూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో 'వస్తున్నా మీకోసం' కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయలేక పోయారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రైతులకు బీఆర్ఎస్ రుణమాఫీ చేసినా అసలు కంటే వడ్డీ ఎక్కువయిందని ఎద్దేవా చేశారు. ఏప్రిల్‌లో వచ్చిన తుఫాన్ వల్ల జహీరాబాద్ నియోజకవర్గంలో భారీగా పంట నష్టం వాటిల్లినా నష్టపరిహారం అందలేదని వాపోయారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, కాంగ్రెస్ నాయకులు పి.నర్సింహారెడ్డి, మక్సూద్, హన్మంత్‌రావుపాటిల్, శ్రీనివాస్ రెడ్డి, అక్బర్, గుండ్‌రెడ్డి, జి.భాస్కర్, శుక్లవర్ధన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, ఉదయ్‌శంకర్‌పాటిల్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పుల భారంతో ఆత్మహత్య


సుధాకర్ (ఫైల్)

నర్సాపూర్‌రూరల్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన మంగళి సుధాకర్(40) అప్పులు చేసి తన సొంత భూమిలో మూడు నెలల క్రితం బోరుబావి తవ్వించాడు. మరి కొన్ని అప్పుల కారణంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం మద్యం తాగి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం ఉదయం ఇంటి పక్కన గల పశువుల కొట్టంలో సుధాకర్ ఉరివేసుకుని ఉండడం గుర్తించి అతడి భార్య నిర్మల పోలీసులకు ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై..


ఆత్మహత్యకు పాల్పడిన నర్సింలు

రాయపోలు(దుబ్బాక): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయపోలులో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం సూరంపల్లికి చెందిన వ్యవసాయ కూలీ నర్సింలు(26) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిన నర్సింలు రాయపోలు వద్ద ఓ చింతచెట్టు సమీపంలో పురుగుల మందు తాగాడు. ఈ విషయాన్ని తన తండ్రికి, సోదరుడికి ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే వారు అక్కడికి చేరుకుని అతడిని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడల్లో స్నేహపూర్వకంగా పోటీపడాలి

గురుకుల విద్యా సంస్థ ఆర్‌సీఓ భీమయ్య

హత్నూర (సంగారెడ్డి): క్రీడాకారులు క్రీడల్లో స్నేహపూర్వకంగా పోటీపడాలని గురుకుల విద్యా సంస్థ ఆర్‌సీఓ భీమయ్య సూచించారు. హత్నూర గురుకుల పాఠశాలలో జోనల్ రెండో రోజు క్రీడా పోటీల్లో గెలుపొందిన అథ్లెటిక్స్ క్రీడాకారులకు శనివారం ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాష్ట్ర దేశస్థాయిలో గుర్తింపు తీసుకురావడం జరిగిందన్నారు. మూడు రోజులు పాటు జరిగే జోనల్ క్రీడల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ వాసు, ప్రిన్సిపల్ వివేకానంద, సుధాకర్, పీడీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు పథకాలను అందజేస్తున్న భీమయ్య

చికిత్స పొందుతూ యువతి..

తూప్రాన్: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడిన యువతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో జంగం కృష్ణ కుటుంబ సభ్యులు ఐదు సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నారు. ఆయన రెండో కూతురు స్వాతి(18) ఇంటర్ చదువుతోంది. గత నెల 17న ఇంట్లో బాల్కనీలో బట్టలు ఆరవేస్తూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడి తీవ్ర గాయాల పాలయింది. వెంటనే కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్వాతి ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఒకరు గాయపడిన ఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని గడిపెద్దాపూర్ చౌరస్తాలో శనివారం చోటు చేసుకుంది. గడిపెద్దాపూర్ తండాకు చెందిన శంకర్‌నాయక్ బైక్‌పై పెద్దాపూర్ నుంచి తండాకు వెళ్తుండగా, నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో శంకర్‌నాయక్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీ కొని..

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై వెళ్తున్న భార్యాభర్తలను లారీ ఢీకొన్న ఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం బొంతపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ గౌడ్, అతడి భార్య పుష్పలతతో బుధవారం సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వైపు బైక్‌పై వస్తున్నారు. వారు ఇస్నాపూర్ చౌరస్తా వద్దకు రాగానే జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని అశోక్‌నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, భార్య పుష్పలత కోమాలో ఉండగా, భర్త చికిత్స పొందుతున్నాడు. బంధువు రవీందర్‌గౌడ్ శనివారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపులో చోరీ

నారాయణఖేడ్: పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో ఫోనెక్స్ మొబైల్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. షాపు యజమాని ఎం.ఏ.ముజీబ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు షాపు వెనుక వైపు ఇనుప ద్వారం విరగొట్టి, పైన సీలింగ్‌ను తొలగించారు. 5 కొత్త మొబైల్ ఫోన్లు, మరమ్మత్తుల కోసం వచ్చిన మరో మూడు మొబైల్ ఫోన్లు, అలాగే నాలుగు పవర్ బ్యాంకులు, మూడు బ్లూటూత్‌లు, రూ.7 వందల నగదు అపహరించారు. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిప్యూటీ తహసీల్దార్‌నంటూ దందా..

- తహసీల్దార్ ఫిర్యాదు.. • నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

తూప్రాన్: డిప్యూటీ తహసీల్దార్‌ను అంటూ ప్రజలను మభ్యపెడుతూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిజాంపేట మండలం తిప్పనగుళ్ల గ్రామానికి చెందిన కట్ట నరేష్ కొద్ది రోజులుగా తాను డిప్యూటీ తహసీల్దార్‌ను అంటూ ప్రజలను మభ్యపెడుతున్నాడు. భూసంబంధ వివాదాస్పద అపరిష్కృత సమస్యలు పరిష్కరిస్తానంటూ వారికి నమ్మబలుకుతున్నాడు. ఈ విషయం స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి దృష్టికి రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.